క్లుప్తంగా

ఫిజియోథెరపి క్యాంపు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. వైద్యుడు అరుణ్, అంగవైకల్యం గల చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి రోజు ఫిజియోథెరపికి సంబంధించిన వ్యాయామాలు చేయడం వల్ల అంగవైకల్యం దూరమవుతుందని వైద్యుడు చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. భవిత సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కామారెడ్డి అర్బన్: బిహార్‌లో ఈనెల 15న నిర్వహించే 58వ జాతీయ స్థాయి క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్–2024 పోటీలకు కామారెడ్డి జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు కే.అనిల్, ఎం.ఈశ్వర్, బి.అర్చన, బి.హరితలను ఎంపిక చేసినట్లు అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్‌లు తెలిపారు. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తీసుకురావాలని పలువురు అసోసియేషన్ ప్రతినిధులు ఆకాంక్షించారు.

శబరిమలకు మాలధారులు



బాన్సువాడ: పవిత్ర పుణ్యక్షేత్రం శబరిమలకు బుధవారం బీర్కూర్ అయ్యప్ప మాలధారులు బయలుదేరి వెళ్లారు. స్థానిక హనుమాన్ ఆలయంలో అయ్యప్ప మాలధార గురుస్వాములు గుడికొండ లింగం, మాదప్పల ఆధ్వర్యంలో వారికి ఇరుముడి కట్టారు. 41 రోజుల పాటు కఠోర దీక్ష చేసి అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు స్వాములు శబరిమలకు తరలివెళ్లారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమవుతారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



మాచారెడ్డి: మండలంలోని లచ్చాపేట ఉన్నత పాఠశాలలో బుధవారం పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వర్ రెడ్డి, పీఆర్టీయూ నేతలు అంతయ్య, రూప్‌సింగ్, శ్రీనివాస్ రెడ్డి, దేవిసింగ్ ఉన్నారు.

హుండీల లెక్కింపు



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో 50 రోజులకు సంబంధించిన 7 హుండీలను బుధవారం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఆధ్వర్యంలో లెక్కించారు. ఏడు హుండీలలో మొత్తం 2లక్షల 63వేల 407 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఈవో శ్రీధర్ రావు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, సిబ్బంది సంతోష్, లక్ష్మణ్, అర్చకులు, భక్తులు ఉన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. మంగళవారం నాటికి లక్షా 49 వేల 660 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



దోమకొండ: సైబర్ నేరాలతో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మురళి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటీపీలు, ఇతర బ్యాంకు ఖాతాల వివరాలు ఫోన్‌లో అపరిచితులకు చెప్పవద్దన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ కూడా పాటించాలని కోరారు. పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించుకోవాలన్నారు. కానిస్టేబుల్‌లు సంజీవ్‌రావ్, స్వామి, రాజమణి, తదితరులున్నారు.



లింగారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో సావిత్రీబాయి పూలే వేషధారణలో బోధిస్తున్న విద్యార్థిని అక్షర



మోడల్‌స్కూల్‌లో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీచర్లు



సజ్జన్‌పల్లి పాఠశాలలో జయంతి వేడుకలు



జంగంపల్లిలో..



చిన్నమల్లారెడ్డి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో..

సావిత్రీబాయి జీవితం ఆదర్శం



జిల్లా కేంద్రంలో బాయ్స్ హైస్కూల్లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నేతలు



తుజాల్‌పూర్‌లో..



కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..

సాక్షి నెట్‌వర్క్: మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని పలు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు.

ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మహిళా విద్య కోసం సావిత్రీబాయి ఎంతో కృషి చేశారని, ఆమె జీవితం అందరికీ ఆదర్శప్రాయమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలో తోటి విద్యార్థులకు విద్యార్థులే బోధన చేపట్టారు. పలువురు మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.



ఎల్లారెడ్డిలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు



బాన్సువాడ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో..



బీర్కూర్‌లో..



నెమ్లి పాఠశాలలో..



బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులు



పిట్లంలో.. బీసీ సంఘం సభ్యులు

ఈ-కేవైసీ అవస్థలు

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డిలో ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలు నానాతంటాలు పడుతున్నారు. గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బ్యాంక్ తెరవక ముందే ప్రజలు ఆధార్ అప్డేట్ కోసం ఉదయం 8 గంటల నుంచే బ్యాంక్ వద్దకు వచ్చి క్యూలో తమ ఆధార్ కార్డులను కవర్లను తమకు సంబంధించిన వస్తువులను పెడుతున్నారు. ఆధార్ కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌కు సరైన అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నట్లు పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం బ్యాంక్ తెరవక ముందే ప్రజలు ఆధార్ అప్డేట్ కోసం ఆధార్‌కార్డులు, కవర్లను పెట్టిన విషయం 'సాక్షి' కంటపడటంతో క్లిక్ మనిపించింది.



ఆధారు కార్డు, కవర్లను క్యూలో ఉంచిన దృశ్యం

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో గల స్వప్నలోక్ కాలనీలో మున్సిపల్‌కు చెందిన స్థలాన్ని ఓ కుల సంఘానికి చెందిన సభ్యులు అక్రమంగా కబ్జా చేసి భవన నిర్మాణ పనులు చేపడుతున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని బుధవారం ఆ కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌కు ఫిర్యాదు చేశారు. నిజాంసాగర్ రోడ్‌లో ఎస్పీఆర్ స్కూల్ సమీపంలో గల స్వప్నలోక్ కాలనీలో మున్సిపల్ ఓపెన్ స్థలంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు అధికారులు సైతం హరిత హారం మొక్కలను నాటారని గుర్తు చేశారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆ మొక్కలన్నీ నరికేసి ఆ మున్సిపల్ స్థలంలో దేవునిపల్లికి చెందిన ఓ కుల సంఘం భవన నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సి టౌన్‌ప్లాన్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.



ఫిర్యాదు చేస్తున్న స్వప్నలోక్ కాలనీవాసులు

సామాన్యులకు వేద విద్య అభినందనీయం



కామారెడ్డి అర్బన్: కంప్యూటర్ యుగంలో వైదిక ధర్మం కోసం తమ పిల్లలను వేద సంస్కృత పాఠశాలలో చేర్పించిన తల్లిదండ్రులు గొప్ప దేశభక్తులని కామారెడ్డి పట్టణ పరిధిలోని టేకిర్యాల శ్రీరామకృష్ణ వైదిక ధర్మ పీఠం ఆగమ వేద సంస్కృత పాఠశాల శిర్లవంచ కృష్ణామాచార్యులు, శ్రీరామకోటి జపలిఖిత ప్రచారకులు కృష్ణానందస్వామి అన్నారు. బుధవారం పాఠశాలలో వైదిక కార్యక్రమం నిర్వహించారు. వేద విద్యను సామాన్యులకు అందించాలనే సంకల్పం తీసుకున్న కృష్ణామాచార్యులను కృష్ణానందస్వామి అభినందించారు.

ఇద్దరు బడిబయట పిల్లల గుర్తింపు



చిన్నమల్లారెడ్డిలో బడిబయట బాలుడితో అధికారులు



సజ్జన్‌పల్లిలో మరో బాలుడు..

కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డిలో ఇద్దరు ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను సీఆర్పీ చిరంజీవి, ఐఈఆర్‌పీలు భక్తమాల, సారిక గుర్తించారు. బడి బయటి పిల్లలు బడిలో ఉండే విధంగా చూడాలని, చిన్నపిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

లింగంపేట పరిధిలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): సజ్జనపల్లి, సురాయిపల్లి తండా, తదితర గ్రామాల్లో బుధవారం బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. పలువురిని దగ్గరలో ఉన్న పాఠశాలల్లో చేర్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు సంజీవ్‌కుమార్, గంగాధర్, విజయ్, సంగాగౌడ్ పాల్గొన్నారు.

సమాచారం..

ఐదో తరగతిలో ప్రవేశానికి ఫిబ్రవరి 11న పరీక్ష

పెద్దకొడప్‌గల్(జుక్కల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గిరిజన సంక్షేమ జనరల్ గురుకుల, మహాత్మా జ్యోతీబాపూలే పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశానికి ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పెద్దకొడప్‌గల్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రధానోపాధ్యాయురాలు నళిని తెలిపారు. ఆన్‌లైన్‌లో జనవరి 6 లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు.

నేటి ప్రజాపాలన సభలకు హాజరుకానున్న ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట, మాసాన్‌పల్లి గ్రామాలలో గురువారం జరుగనున్న ప్రజాపాలన గ్రామసభలకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హాజరు కానున్నట్లు స్థానిక ఎంపీడీవో రఘు తెలిపారు. మాసాన్‌పల్లి, నాగిరెడ్డిపేట గ్రామాలలో ఉదయం 8 గంటలకు గ్రామసభలు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామసభలకు హాజరుకావాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న ప్రజాపాలన



దరఖాస్తులు స్వీకరిస్తున్న జెడ్పీ సీఈవో సాయా గౌడ్



సంగోజీపేట్‌లో..

సాక్షి నెట్‌వర్క్: ప్రజాపాలన కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్విరామంగా కొనసాగుతోంది. ప్రజలు దరఖాస్తులు అందించేందుకు బుధవారం కూడా బారులు తీరారు. ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించే కేంద్రాలను ఉన్నతాధికారులు పరిశీలించారు. అర్హులైన వారందరూ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు. ఈ నెల 6 వరకు స్వీకరణ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రస్తుతం రేషన్ కార్డులు ఉన్నవారు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



భవానిపేట తండాలో.. ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి



సజ్జన్‌పల్లిలో.. ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి



కోనాపూర్‌లో..



జలాల్‌పూర్‌లో ..

ఆలయ ఫంక్షన్ హాల్ బిల్డింగ్ ద్వారోత్సవం



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి మల్లిఖార్జునస్వామి ఫంక్షన్ హాల్ బిల్డింగ్ నిర్మాణం దర్వాజ(కడప ఎక్కించుట)ద్వారోత్సవాన్ని బుధవారం ఆలయ అర్చకులు శ్రీనివాస్‌రావు, సంగమేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉరుదొండ వనిత, వీడీసీ అధ్యక్షుడు మర్కంటి స్వామి, ఉపాధ్యక్షుడు భోజన్నగారి రాజుపాటిల్, గూడెల్లి రమణ, ద్యావరి నవీన్, రాహుల్, నాగల్ల స్వామి, మీసాల శంకర్, బాలయ్య, నిట్టు నారాయణరావు, ఉనుగురి భాస్కర్‌రావు, బీజేపీ నాయకులు చిన్నోళ్ల రజనీకాంత్, చిన్నోల్ల రామక్రిష్ణ, కాసర్ల రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

బాన్సువాడ: మున్సిపాలిటీ పరిధిలో మంచి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అన్నారు. బుధవారం బాన్సువాడ శివారులోని మంజీర ప్రాంతంలో పంప్‌హౌస్‌లో ఉన్న మోటార్లను ఆయన పరిశీలించారు. పైపులైనులో లీకేజీల కారణంగా సింగూర్ నుంచి వచ్చే మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో పట్టణానికి రెండు రోజులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. మంజీర పంప్‌హౌస్ నుంచి ఫిల్టర్ బెడ్‌కు వచ్చే నీటిని పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులో నీటి సమస్య రాకుండా చూడాలని అన్నారు. ఆయన వెంట కమిషనర్ రమేష్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్‌రెడ్డి తదితరులున్నారు.



మోటార్లు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

ఎల్ఐసీలో ఖాళీలను భర్తీ చేయండి

కామారెడ్డి అర్బన్: భారతీయ జీవిత బీమా సంస్థకు చెందిన పలు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎల్ఐసీ కామారెడ్డి శాఖ ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కాసాల అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఎల్ఐసీలో కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న అన్ని తరగతుల ఉద్యోగాలను భర్తీ చేయాలని, పెన్షన్ స్కీం యాజమాన్య వాటాను పది నుంచి 14 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.సంపత్ కుమార్, ఆయా యూనియన్ల ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, ఇక్బాల్, వీరేశలింగం, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిబ్బంది

సిలబస్ సకాలంలో పూర్తి చేయాలి

దోమకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. కళాశాలను ఆయన బుధవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య, హాజరు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపల్ జైపాల్‌రెడ్డి, అధ్యాపకులు వసంత్ కుమార్, శేషారావు, సంతోష్‌రెడ్డి, రాజు, ఆసియా పర్వీన్, రజిత, రోహిణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం

స్థలంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వినతి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఇంటి స్థలంతో పాటు ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరుతూ బుధవారం తెలంగాణ ఉద్యమకారులు తహసీల్దార్ సునీతకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆంధ్రా పాలకులు తెలంగాణాలో ఉన్న సంపద, నీళ్లు, నిధులు, నియామకాలు దోచుకొని రాజభోగాలు అనుభవిస్తూ తెలంగాణా ప్రజలకు అన్యాయం చేస్తున్నారని తెలుసుకొని ఎర్రాపహాడ్, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన 9 మందిమి ఉద్యమంలో పాల్గొన్నామన్నారు 2009లో కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టామన్నారు. దీంతో అప్పటి పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారన్నారు. తమకు ఇంటి స్థలాన్ని కేటాయించి ఇళ్లను నిర్మించి, నెలకు రూ.10 వేల చొప్పున పెన్షన్, ఉచిత బస్ పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నర్సారెడ్డి, రాజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చిట్యాల సాయన్న, ఏనుగు మధుసూదన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రమేష్‌రెడ్డి, జంగి రాజయ్య పాల్గొన్నారు.



తహసీల్దార్ సునీతకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉద్యమకారులు